**విలేకరులు కావలెను**

పవర్ జాతీయ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను.

ఆసక్తి కలవారు, అనుభవం కలవారుసంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాలవారీగా విలేకరులు కావలెను

సీనియర్లకు ప్రాధాన్యత, కొత్తవారికి అవకాశం ఉంటుంది

ఇంచార్జ్ : పొన్నం మహేష్‌గౌడ్

90004 88885



# Dr.PRK పవర్

పోరాడితే పోయిదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప



**రామకృష్ణ హాస్పిటల్స్**

పక్షవాతం, డిస్క్ సమస్యలు, నడుమునొప్పి, మెడ నొప్పులకు పూర్తి చికిత్స కలదు.

నిరుపేదలకు ఉచిత వైద్యం



**రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్**

విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ

సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 333 | శుక్రవారం 4 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


## మంత్రివర్గం నుంచి

# కొండా సురేఖ ఔట్..

### తక్షణం కొండా సురేఖను బర్తరఫ్ చేయాలంటూ లేఖ పంపిన సీఎం

### రాజీనామాకు కొండా సురేఖ ససేమిరా అనడంతో బర్తరఫ్ నిర్ణయం

### సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సును ఆమోదించిన గవర్నర్ శివ్‌ప్రతాప్

హైదరాబాద్, పవర్ న్యూస్



రాష్ట్ర కాంగ్రెస్‌లో కొద్దిరోజులుగా నలుగుతున్న కొండా సురేఖ ఎపిసోడ్‌కు తెరపడింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్ శివ్ ప్రసాద్ శుక్లాకు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని లేఖను పంపడంతో ఆయన ఆమోదం తెలిపారు. దీంతో మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగించినట్లైంది. అంతకు ముందు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించేందుకు ఏఐసీసీ క్లియరెన్స్ ఇచ్చింది.

రాజీనామాకు ససేమిరా : దీంతో తక్షణమే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌కు పంపిన లేఖలో స్పష్టం చేశారు. కొండా సురేఖను మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరినా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో బర్తరఫ్ చేయాలని ముఖ్యమంత్రి లేఖ రాయడం, దానికి గవర్నర్ ఆమోదంతో పార్టీలో జరిగిన నాటకీయ పరిణామాలకు తెరపడినట్లైంది.

పీసీసీ సీరియస్ : పరకాల టికెట్ ఆశిస్తున్న కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించేందుకు కారణమయ్యాయనే హస్తం నేతలు అంటున్నారు. పరకాల సిట్టింగ్ మీూ రేవూరి ప్రకాశ్ రెడ్డికే మళ్లీ టికెట్ ఇస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనను సుస్మిత గత నెల 19న కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో బహిరంగంగా సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్‌లోని సీనియర్ నేతలపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆ అంశంపై పలువురు కాంగ్రెస్ నేతలు పీసీసీకి ఫిర్యాదు చేశారు. పీసీసీ సూచన మేరకు మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణా కమిటీ ఆ విషయంపై దృష్టిసారించింది.

వాదనలు, వివరణలు : సుస్మిత వ్యాఖ్యలపై పూరిస్థాయిలో విచారణ చేయాలని మల్లు రవిని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించగా కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సుస్మిత వ్యాఖ్యలపై వివరణ తీసుకున్నారు. తన కుమార్తె స్వతంత్ర మహిళ అని పేర్కొన్న

..మిగతా 2లో

# కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

2లో..

### సురేఖ, చిన్నారెడ్డి స్థానంలో కొత్త వారికి చాన్స్

### ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా గద్వాల విజయ లక్ష్మి.. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద

### కుడా చైర్ పర్సన్ గా గుండు సుధారాణికి చాన్స్... బీసీ వర్గానికి చెందిన మహిళలకు అవకాశం

# కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి నియామకం

### శుభాకాంక్షలు తెలిపిన రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

(వరంగల్ -- పవర్):




గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి గుండు సుధారాణి గారిని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఖఖణూూ) చైర్‌పర్సన్‌గా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం పట్ల వరంగల్ పౌరులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ గారు గుండు సుధారాణి గారికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కుడా చైర్‌పర్సన్‌గా ఆమె పదవీ బాధ్యతలు చేపట్టడం వరంగల్ నగర మరియు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని, ఆమె నాయకత్వంలో 'కుడా' సరికొత్త మైలురాళ్లను అందుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**సుదీర్ఘమైన రాజకీయ ప్రస్థానం**

వరంగల్‌లో జూలై 28, 1964న జన్మించిన గుండు సుధారాణి గారు మధురై కామరాజ్ యూనివర్సిటీ నుండి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎం.ఏ (వీూూ.) పట్టా పొందారు. బిసి-పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకురాలిగా పేరుపొందిన ఆమె స్థానిక సంస్థల నుండి పార్లమెంట్ వరకు వివిధ స్థాయిల్లో ప్రజాసేవ అందించారు.

**టీడీపీలో ప్రస్థానం:** 2002-2004 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం (ఋణ) బోర్డు మెంబర్‌గా, 2005-2010 వరకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2010 నుండి 2016 వరకు రాజ్యసభ సభ్యురాలిగా పార్లమెంట్‌లో సేవలందించారు.బీఆర్ఎస్‌లో బాధ్యతలు: 2015 అక్టోబర్‌లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. మే 2021లో 29వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిచి, గ్రేటర్ వరంగల్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టి నగర అభివృద్ధికి కృషి చేశారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిక:** 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఏప్రిల్ 25, 2024న ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు.గ్రేటర్ వరంగల్ మేయర్‌గా, ఎంపీగా సుదీర్ఘ పాలనా అనుభవం ఉన్న గుండు సుధారాణి గారి నాయకత్వంలో 'కుడా' పరిధిలోని వరంగల్, హన్మకొండ, కాజీపేట త్రినగరాల అభివృద్ధి మరింత వేగవంతమైన పురోగతి సాధిస్తుందని స్థానిక నాయకులు, ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ

# ఆదికి అదృష్టం వరించేనా..?

### సురేఖ ఔట్..మంత్రి బెర్త్‌పై ఆది శ్రీనివాస్ పేరు

### బీసీ కోటా.. విధేయత.. విప్ అనుభవం.. కలిసి వస్తాయా?

### వేములవాడకు తొలిసారి మంత్రి పదవిపై మళ్లీ జోరుగా చర్చ

వేములవాడ, పవర్ న్యూస్



తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామంచోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గవర్నర్‌కు సిఫార్సు చేశారు. దీంతో ఖాళీ కానున్న మంత్రి పదవిని ఎవరితో భర్తీ చేస్తారన్న చర్చ ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది.

సురేఖ స్థానంలో ఆది?మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై ఏడాదికాలంగా రకరకాల ప్రచారాలు కొనసాగుతున్నాయి. ప్రతి సందర్భంలోనూ ఆది శ్రీనివాస్ పేరు మంత్రి రేసులో వినిపిస్తూనే ఉంది. అయితే అధిష్ఠానం నుంచి స్పష్టమైన నిర్ణయం లేకపోవడంతో అది ముందుకు సాగలేదు. తాజాగా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడంతో.. ఖాళీ అయ్యే స్థానాన్ని బీసీ సామాజిక వర్గంతో భర్తీ చేయాలన్న సమీకరణం తెరపైకి వస్తే ఆది శ్రీనివాస్‌కు అవకాశం దక్కవచ్చన్న చర్చ మళ్లీ ఊపందుకుంది.

**బీసీ సమీకరణమే కీలకమా?**

మంత్రివర్గంలో మార్పులు జరిగే సమయంలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కీలకంగా మారుతాయి. సురేఖ స్థానంలో అదే విస్తృత సామాజిక సమీకరణాన్ని కొనసాగించాలన్న ఆలోచన ఉంటే.. మున్నూరు కాపు బీసీ వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ పేరు సహజంగానే పరిశీలనలోకి వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా బీసీ ప్రాతినిధ్యంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మరో బెర్త్ కల్పించినట్లవుతుందన్న లెక్కలు వినిపిస్తున్నాయి.

**ఏడాదిగా వినిపిస్తున్న పేరు**

ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారం ఇప్పటిది కాదు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చర్చ జరిగిన ప్రతిసారీ ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే రాజకీయ సమీకరణాలు, అధిష్ఠానం నిర్ణయాలు, ఇతర ఆశావహుల పోటీతో ఈ అంశం వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు మాత్రం సురేఖ తొలగింపుతో ఖాళీ ఏర్పడటంతో ఆది పేరు మరోసారి చర్చకు వచ్చింది.

**పార్టీ కోసం.. కష్టకాలంలోనూ**

ఆది శ్రీనివాస్ సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌తో అనుబంధాన్ని కొనసాగిస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను వీడకుండా పనిచేశారన్న పేరు ఆయనకు ఉంది. 2009 నుంచి వేములవాడ అసెంబ్లీ స్థానంలో పోటీ చేస్తూ వచ్చిన ఆయన.. 2023 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వ విప్‌గా కీలక

మిగతా 2లో

### దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు ఒవైసీ బ్రదర్స్

# తక్కువేమీ కాదు

### ఎంఐఎం దేశ వ్యతిరేకమనేది దుష్ప్రచారమన్న రేవంత్

### ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై అసద్, అక్బర్‌తో చర్చించానని వెల్లడి

### అసద్ సూచించిన అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేయాలని ఆదేశం

### పాతబస్తీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ

### హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించడమే లక్ష్యమని వెల్లడి



హైదరాబాద్, పవర్ న్యూస్

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు అసదుద్దీన్ ఒవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసద్, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమంటూ జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. సైదాబాద్ స్టీల్ బ్రిడ్జిని సీఎం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. అసదుద్దీన్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఓల్డ్‌సిటీ

..మిగతా 2లో

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం.. 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్



గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి.తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి.

ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది.

ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు.నానక్‌రామ్‌గూడలోని లోథా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

# జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ

**యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ**

**భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ**

**బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ**

**శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3**

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్–ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. "ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి" అని పేర్కొన్నారు.

నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు.

జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు. శాంతి ప్రక్రియలో భారత్ మరింత చురుకైన పాత్ర పోషించాలని ఉక్రెయిన్ కోరింది.

భారత్–ఉక్రెయిన్ మధ్య వాణిజ్యం ప్రస్తుతం 2.6 బిలియన్ డాలర్లుగా ఉందని సిబిహా తెలిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, పునర్నిర్మాణంలో భారత కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచుకోవాలని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇంధనం, మౌలిక వసతులు, రవాణా, వ్యవసాయం, ఔషధాలు, డిజిటలైజేషన్, ఇంజినీరింగ్ రంగాల్లో సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు.

జైశంకర్ ఉక్రెయిన్ పర్యటన మరో విషయంలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భారత విదేశాంగ మంత్రి ఉక్రెయిన్‌కు స్వతంత్ర ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి.

# తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం..!

**వెయ్యి రోజుల పాలనపై అధికార ప్రతిపక్షాల పోటాపోటీ.. సవాళ్లు, విమర్శలతో రాజకీయ వేడి..**

**నిన్నటి బీఆర్ఎస్‌పై నేటి కాంగ్రెస్.. నేటి కాంగ్రెస్‌పై నిన్నటి బీఆర్ఎస్.. ప్రజలు మాత్రం ఎవరి మాట నమ్మాలో తేల్చుకోలేక...!**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 3**




తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఓ ఆసక్తికరమైన రాజకీయ దృశ్యం కనిపిస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పేరుతో సంబరాలు నిర్వహిస్తూ తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ అదే వెయ్యి రోజుల పాలనను వైఫల్యాల పాలనగా అభివర్ణిస్తూ నిరసనలు, కార్యక్రమాలు చేపడుతోంది.ఇద్దరి మాటల్లోనూ ప్రజలే కేంద్రబిందువు.ఇద్దరి విమర్శల్లోనూ ప్రజల సమస్యలే అంశం.ఇద్దరి సభల్లోనూ హామీలే ప్రధాన అస్త్రం.కానీ ప్రజల్లో మాత్రం మరో ప్రశ్న వినిపిస్తోంది.నిన్న ఒకరిని నమ్మాం.. నేడు మరొకరిని నమ్మాం.. ఇక రేపు ఎవరిని నమ్మాలి..? తుంటా.. మొద్దా.?ప్రజల తీర్పే తుది.!రాజకీయాలను వ్యంగ్యంగా పరిశీలిస్తే.. గత బీఆర్ఎస్ పాలనను 'తుంట'గా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను 'మొద్దు'గా పోల్చుకునే పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.ఒకప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉండి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టింది. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ అదే పాత్రను పోషిస్తోంది.అప్పుడు కాంగ్రెస్ చేసిన విమర్శలను ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తోంది.ఇప్పుడు బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు అప్పట్లో కాంగ్రెస్ చేసిన సమాధానాలే తరహాలో కాంగ్రెస్ స్పందిస్తోంది.పార్టీలు మారాయి.. అధికార కుర్చీ మారింది.. కానీ రాజకీయ విమర్శల తీరు మాత్రం పెద్దగా మారలేదనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**వెయ్యి రోజులు.. రెండు వాదనలు....!**

కాంగ్రెస్ నాయకులు మాత్రం వెయ్యి రోజుల పాలనను విజయవంతమైన ప్రజా పాలనగా అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రైతులు, మహిళలు, యువతకు చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

మరోవైపు బీఆర్ఎస్ నాయకత్వం మాత్రం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, యువత, పేదల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది.

ఇలా అధికార పక్షం వెయ్యి రోజుల విజయోత్సవం అంటుంటే.. ప్రతిపక్షం వెయ్యి రోజుల మోసం అంటూ ప్రజల్లోకి వెళ్తోంది.

**సవాళ్లు ఘనం.. నిజం ఎంత...?**

రాజకీయ వేదికలపై సవాళ్లు విసురుకోవడం కొత్తేమీ కాదు. అయితే ఇప్పుడు రెండు ప్రధాన రాజకీయ శిబిరాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది.మేము ఇది చేశాం,

మీరు అది చేయలేదు,మా హామీలు అమలు చేశాం,మీ హామీలు ఏమయ్యాయి..?

అంటూ పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు.అయితే రాజకీయ పార్టీల మాటలకంటే ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పే అసలు కొలమానం.రైతుకు లాభమైందా.?

**యువతకు ఉద్యోగం దొరికిందా.?**

మహిళకు ఆర్థిక భరోసా పెరిగిందా.?

పేద కుటుంబానికి ఇల్లు, విద్య, వైద్యం అందిందా.? గ్రామానికి రోడ్డు, తాగునీరు, సాగునీరు వచ్చాయా.?

ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలే ప్రజల తీర్పును ప్రభావితం చేయనున్నాయి.

**'తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం'!**

తెలంగాణ రాజకీయాల్లో ప్రజల నోట వినిపిస్తున్న వ్యంగ్య వ్యాఖ్యల్లో ఇదొకటి.

తుంటను ఎత్తేసి.. మొద్దును ఎత్తుకున్న శాస్త్రం అయిపోయింది..!అంటే గత ప్రభుత్వంపై అసంతృప్తితో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తి ఏర్పడితే మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తారా.? లేక మరో ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంటారా.? అన్నదే రాజకీయ వర్గాల్లో చర్చ.

ఇక్కడ అసలు విషయం పార్టీలు కాదు.. ప్రజల విశ్వాసం.ఒకసారి అధికారంలోకి వచ్చిన పార్టీ ప్రజల అంచనాలను అందుకోకపోతే ప్రజలు మరో పార్టీకి అవకాశం ఇస్తారు. అదే పార్టీ కూడా అంచనాలను అందుకోలేకపోతే మళ్లీ ప్రజలు తమ రాజకీయ నిర్ణయాన్ని మార్చుకుంటారు.

**అందుకే ప్రజాస్వామ్యంలో శాశ్వతంగా ఎవరికీ అధికారం రాసి ఉండదు.**

లిప్రజలు చూస్తున్నది మాటలు కాదు.. పనులు..!లిఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు ప్రజల జ్ఞాపకాల్లో ఉంటాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిలో ఎన్ని అమలు చేశారన్నదే ప్రజల పరిశీలన.ప్రభుత్వం సంబరాలు చేసుకుంటే ప్రజలు కూడా అదే స్థాయిలో సంతోషంగా ఉన్నారా...?

ప్రతిపక్షం ప్రభుత్వం విఫలమైందంటే ప్రజలు కూడా అదే అభిప్రాయంలో ఉన్నారా..?

అన్నది ఎన్నికల సమయంలోనే స్పష్టమవుతుంది.!

అంతవరకు మాత్రం అధికార--ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవచ్చు. సవాళ్లు విసురుకోవచ్చు. సభలు నిర్వహించవచ్చు. భారీ కార్యక్రమాలు చేపట్టవచ్చు.

కానీ ప్రజల తీర్పు మాత్రం రాజకీయ సభల్లో కాదు.. ఓటు పెట్టే రోజునే వెలువడుతుంది.

**సానుభూతి కోసం రాజకీయ ఆపసోపాలు..?**

ప్రస్తుత రాజకీయ పరిస్థితిని గమనిస్తే రెండు శిబిరాలు కూడా ప్రజల్లో తమకు అనుకూల వాతావరణం సృష్టించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది.

అధికార పక్షం అభివృద్ధి, సంక్షేమం, పాలనా విజయాలను ప్రచారం చేస్తోంది.

ప్రతిపక్షం ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలు తీరును ప్రశ్నిస్తోంది.ఇద్దరి లక్ష్యం ఒక్కటే ప్రజల విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవడం.

అయితే ప్రజలు మాత్రం గత అనుభవాలను, ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుంటున్నారు.

**ఎవరు ఎక్కువగా మాట్లాడారు.? కంటే**

ఎవరు ఎక్కువగా చేశారు..? అన్నదే ప్రజలకు ముఖ్యమవుతోంది.చివరికి.. ప్రజలదే శాస్త్రం..!

తుంట కావచ్చు.. మొద్దు కావచ్చు.. ఏ పార్టీ అయినా ప్రజల కోసం పనిచేస్తేనే ప్రజలు ఆదరిస్తారు.గతాన్ని తవ్వడం ద్వారా భవిష్యత్తు నిర్మాణం కాదు.గత ప్రభుత్వ తప్పులను చూపించడం ఒక్కటే ప్రస్తుత ప్రభుత్వానికి విజయపత్రం కాదు.ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం ఒక్కటే ప్రతిపక్షానికి ప్రజల మద్దతును తెచ్చిపెట్టదు.

ప్రజలకు కావాల్సింది మాటల యుద్ధం కాదు.. పని.సవాళ్లు కాదు.. పరిష్కారాలు.

**సంబరాలు కాదు.. ఫలితాలు.**

వెయ్యి రోజుల రాజకీయ రచ్చలో అధికార పక్షం విజయోత్సవాలు చేసుకుంటోంది.. ప్రతిపక్షం పోరుబాట పడుతోంది.కానీ ఈ రెండు శిబిరాల మధ్య నిలబడి ఉన్న ప్రజలు మాత్రం ప్రశాంతంగా ఒక్కటే అడుగుతున్నారు.?

తుంటను ఎత్తేసి మొద్దును ఎత్తుకున్నాం.. ఇక మరోసారి ఎవరిని ఎత్తుకోవాలి..?

ఆ ప్రశ్నకు సమాధానం రాజకీయ నాయకుల దగ్గర లేదు. ప్రజల ఓటు దగ్గరే ఉంది.



## మండల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట అర్ధరాత్రి గ్రామస్థుల ధర్నా

**గద్వాల జిల్లా ప్రతినిధి (మాచర్ల / కొత్తపల్లి) , సెప్టెంబర్ 3**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామస్థులు మాచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అర్ధరాత్రి ధర్నా నిర్వహించి సబ్ స్టేషన్‌ను ముట్టడించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు, నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో నిరంతరం విద్యుత్ కోతలు విధించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకాశంలో మబ్బులు వేసినా, సన్నపాటి గాలి వీచినా, చినుకులు పడినా వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని తెలిపారు. పక్కనే ఉన్న ఇతర గ్రామాలకు, ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉంటున్నా, మల్లంపల్లి, కొత్తపల్లి గ్రామాలకు మాత్రం కరెంట్ పునరుద్ధరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రాత్రి వేళల్లో కనీసం సింగిల్ ఫేజ్ విద్యుత్ కూడా ఇవ్వకపోవడంతో దోమలు, పాములు, విషకీటకాల భయంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. స్థానికంగా ఉన్న లైన్ మెన్లకు వయసు పైబడటంతో పనుల్లో ఆలస్యం జరుగుతోందని, యువకులైన సిబ్బందిని కేటాయించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రామస్థుల పరంగా అవసరమైన కూలీలను, ఇతర సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని కోరారు.తమ సమస్యపై విద్యుత్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విద్యుత్ లైన్లను సరిచేసి క్రమం తప్పకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని, లేనిపక్షంలో నిరసనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఔట్

**మొదటి పేజీ తరువాయి...**

కొండా సురేఖ.. ఆ వ్యాఖ్యలకు తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఆ వ్యాఖ్యలకి తాను బాధ్యురాలిని కాదని క్రమశిక్షణా కమిటీ ముందు వివరణఇచ్చారు. తనపై అవినీతి ఆరోపణలు లేవి సురేఖ వివరణ ఇచ్చినా.. క్రమశిక్షణా కమిటీ సంతృప్తి చెందలేదు. సుస్మిత వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానించి నివేదికను ఢిల్లీకి పంపింది.

హస్తినకు చెందిన పంచాయితీ : తరువాత ఢిల్లీ వేదికగా హైడ్రామా సాగింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ హస్తినలో పార్టీ హైకమాండ్‌తో సమావేశమయ్యారు. పార్టీలో క్రమశిక్షణే ముఖ్యమని కఠిన చర్యలు తీసుకోకపోతే పార్టీలో తిరుగుబాట్లు పెరుగుతాయని అధిష్ఠానం పెద్దలకు నివేదించారు. ఢిల్లీ వెళ్లిన కొండా సురేఖ కూడా ఖర్గేను కలిసి తన వాదన వినిపించారు.

తాను బీసీ సామాజికవర్గానికి చెందిన వారమని తమ కుటుంబానికి పెద్ద ఓటుబ్యాంక్ ఉందని చెప్పుకొచ్చారు. అయినా శాంతించని హైకమాండ్ రాజీనామా చేయాలని స్పష్టంచేసింది. సురేఖ అందుకు అంగీకరించకపోవటంతో సీఎం రేవంత్ నేరుగా కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని సిఫార్సు చేస్తూ గవర్నర్‌కి లేఖ పంపారు.

"నన్ను బర్తరఫ్ చేయడాన్ని ఖండిస్తున్నా. నిర్ణయానికి ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?. నా కుమార్తె స్వతంత్ర మహిళ ఆమె వ్యాఖ్యలు ఆమెవే" – కొండా సురేఖ

కీలక పదవుల్లో మార్పులు : రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘారెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి.చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నియమితులయ్యారు.

## కేబినేట్‌లో బీసీ వర్గానికి ప్రాధాన్యత

**హైదరాబాద్, పవర్ న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం రెండు కీలక పదవుల్లో కూడా మార్పులు చేసింది. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుండి జి. చిన్నారెడ్డిని తొలగించి, ఆ స్థానంలో హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని నియమించారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద నియమితులయ్యారు. తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు సంబంధించిన వివాదం నడుస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే టి. మేఘా రెడ్డిపై చేసిన వ్యాఖ్యల కారణంగా చిన్నారెడ్డి కూడా విమర్శల పాలయ్యారు. కొండా సురేఖ తన పైన చర్యల సమయంలో బీసీ కార్డు తెర మీదకు తెచ్చారు. దీంతో.. చిన్నారెడ్డి పైనా చర్యలు వెంటనే తీసుకున్నారు. ఇదే సమయంలో బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ వీరి స్థానం లో కొత్త నియామకాలు చేపట్టారు. చిన్నారెడ్డి స్థానంలో సీనియర్ నేత కేకే కుమార్తె గద్వాల విజయ లక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ గా బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నెరెళ్ల శారద ను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సురేఖ ను బర్తరఫ్ చేయటం తో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ఛైర్ పర్సన్ గా నియమించారు. ఇక.. సురేఖ స్థానంలో కేబినెట్ లోకి బీసీ వర్గానికి చెందిన మహిళకు అవకాశం ఇవ్వనున్నారు. ఈ స్థానంలో కొత్త మంత్రి గా ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఆసక్తి గా మారింది. ఇక.. ఢిల్లీ కేంద్రంగా జరిగిన చర్చల్లో వీరిద్దరి పైనా చర్యలు తీసుకోవాలని రేవంత్ పట్టు బట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగా హైకమాండ్ ఆమోదంతో వేటు వేసారు.

## దేశభక్తిలో మోదీ, అమిత్ షాలకు ఒవైసీ బ్రదర్స్ తక్కువేమీ కాదు

**మొదటి పేజీ తరువాయి...**

అభివృద్ధిపై తాను అసదుద్దీన్, అక్బరుద్దీన్‌తో చర్చించినట్లు తెలిపారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి గత ప్రభుత్వం కొబ్బరికాయ కొట్టిందే తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాతే పనులు ముందుకు సాగాయని చెప్పారు. ఇన్నేళ్లలో ఎంతమంది ముఖ్యమంత్రులు ఓల్డ్‌సిటీకి వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పాతబస్తీ గల్లీల్లోకి తాను తప్ప మరెవరూ రాలేదన్నారు.

**అసద్ చెప్పిన పనులకు వెంటనే అనుమతులు**

ఓల్డ్‌సిటీ అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఏది సూచించినా వెంటనే పరిశీలించి మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు రేవంత్ చెప్పారు. పాతబస్తీలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు. పెద్దలు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు.

**హిందూ, ముస్లింలు కలిసి ఉండాలి**

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వమేనని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు.

# వెయ్యి రోజుల ప్రజాపాలనలో వరంగల్ పశ్చిమ అభివృద్ధికి కొత్త దిశ



ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



(హనుమకొండ -- పవర్):
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ ఆదేశాల మేరకు హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (డీసీసీ భవన్) ఎదుట జిల్లా కాంగ్రెస్ కమిటీ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే ప్రజల కళ్లముందు నిలబెట్టిందని తెలిపారు. గత పాలనకు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనకు ఉన్న స్పష్టమైన వ్యత్యాసాన్ని ప్రజలు స్వయంగా గమనిస్తున్నారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, వరంగల్ విమానాశ్రయం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మాస్టర్ ప్లాన్, కలెక్టరేట్, కాలేజీలు, పాలిటెక్నిక్ మరియు ఐటీఐ కళాశాలల అభివృద్ధి, అలాగే బల్దియా పరిధిలోని ప్రధాన రహదారుల నిర్మాణ పనులు వరంగల్ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని వివరించారు.గతంలో కేవలం శిలాఫలకాలు వేసి కొబ్బరికాయలు కొట్టడం తప్ప నిజమైన అభివృద్ధి జరగలేదని, తమ ప్రభుత్వం శిలాఫలకాల కోసం కాకుండా కళ్లముందు కనిపించే అభివృద్ధి కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో నిధులు తీసుకొస్తూ వరంగల్ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. "మేము సముద్రాన్ని తెస్తామని గానీ, డబుల్ బెడ్రూం ఇళ్లలో వైఫై ఇస్తామని గానీ మభ్యపెట్టలేదు.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం" అని తెలిపారు.గత పదేళ్ల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 80 శాతం అభివృద్ధిని చూపే ధైర్యం లేక ప్రతిపక్షాలు ఇంకా పూర్తికాని 20 శాతం పనులపైనే విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. పారదర్శకత, నీతి నిజాయితీలతో కూడిన పాలన అందిస్తున్నామని, మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్లు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ

# 1000 రోజుల సంక్షేమ పాలనతో
# పరకాల అభివృద్ధికి సరికొత్త బాటలు



ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




(పరకాల -- పవర్):
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 1వ తేదీ నాటికి విజయవంతంగా 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా టీపీసీసీ, డీసీసీ ఆదేశాల మేరకు పరకాల పట్టణ కేంద్రంలో భారీ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ఈ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పరకాలలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ శ్రీ కుంకుమేశ్వర దేవస్థానం, వెల్లంపల్లి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ మరియు హుజూరాబాద్ రోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యే ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ?అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, ప్రజా సంక్షేమ పథకాలే తమ ఆయుధాలని స్పష్టం చేశారు. చారిత్రాత్మక పరకాల పట్టణానికి పూర్వ వైభవాన్ని తీసుకువస్తానని ఆయన హామీ ఇచ్చారు.?ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో రూపుదిద్దుకున్న ప్రజా ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ ఫలాలను ఆయన వివరించారు:?రైతు సంక్షేమం: 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి రుణవిముక్తి కల్పించామని, రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించామని తెలిపారు.?ప్రజా సంక్షేమం: రూ. 500 కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 15.46 లక్షల కొత్త రేషన్ కార్డుల జారీ, పేదలకు సన్న బియ్యం పంపిణీ చేపడుతున్నామన్నారు. 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు ఊరట నిచ్చామని చెప్పారు.?ఉచిత విద్యుత్ ఉ మహిళా సాధికారత: ఆనాడు స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తే, నేడు సీఎం రేవంత్ రెడ్డి గారు 'గృహ జ్యోతి' ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నారని కొనియాడారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు.?విద్యా ఉ మౌలిక వసతులు: పాఠశాల విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచామని, పార్టీలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నామన్నారు. పరకాల పట్టణాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, టాస్క్ (ఆఆఖ) సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అలాగే ప్రత్యేక డిపిఆర్ (ఖా=) వ్యవస్థతో తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.?ఇదే సమయంలో గత బిఆర్ఎస్ పాలనపై ఎమ్మెల్యే రేవూరి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 10 సంవత్సరాల దుర్మార్గపు బిఆర్ఎస్ పాలనను ప్రజలు మర్చిపోవద్దని పిలుపునిచ్చారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ నాయకులు, నాటి ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. అభివృద్ధి పేరుతో దోచుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చరిత్రను ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఎద్దేవా చేశారు. "ధర్మారెడ్డి.. నీవు ప్రజా ప్రతినిధిగా పనికిరావు, వ్యాపారవేత్తగానే పనికివస్తావు. అభివృద్ధి ముసుగులో చల్లా ఇన్ఫ్రా పేరుతో అందినంత ప్రజాధనాన్ని దోచుకున్నావు. తక్కువ ధరలకు భూములు కొని, ప్రభుత్వ సొమ్ముతో రోడ్లు వేసి ఎక్కువ ధరలకు అమ్ముకున్న చరిత్ర నీది" అని తీవ్రస్థాయిలో విమర్శించారు.?ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ, ప్రతి ఒక్కరికీ వివరిస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ



# సీఎంఆర్ఎఫ్ చెక్కులతో నిరుపేదలకు భరోసా

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

(హనుమకొండ -- పవర్):
అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఫ్) అండగా నిలుస్తోందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా కొండంత చేయూతనిస్తోందని తెలిపారు.హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం రోజున వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 6.50 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు అత్యవసర సమయంలో వైద్య సహాయం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఆమె ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ

## మత్తును వదిలి.. జీవితాన్ని ఎంచుకోండి: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

(వరంగల్ -- పవర్):



మత్తు పదార్థాలకు బానిసైన వారు ఆ వ్యసనాన్ని దాచకుండా, పునరావాసం మరియు సరైన చికిత్స కోసం ధైర్యంగా ముందుకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటూనే, వ్యసనానికి గురైన వారిని కేవలం శిక్షించడం మాత్రమే కాకుండా వైద్యం అందించి సాధారణ జీవితంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.ఈగల్ ఫోర్స్ సహకారంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో ఆధునీకరించిన అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ (ఏటీఎఫ్) కేంద్రాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్రత్యేక వార్డును అందుబాటులోకి తెచ్చి, పడకల సామర్థ్యాన్ని 10 నుండి 20కి పెంచినట్లు వివరించారు. ఈ కేంద్రంలో సీసీటీవీ నిఘా, భద్రతా ఏర్పాట్లతో పాటు బాధితులకు మానసిక ఉల్లాసం కలిగించేందుకు క్యారమ్స్, చెస్ వంటి క్రీడా సౌకర్యాలను కల్పించారు. ఇక్కడ అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా వైద్యం, కౌన్సెలింగ్, డీ-అడిక్షన్ సేవలు అందుతాయి.పిల్లలు లేదా కుటుంబ సభ్యులు ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసైనట్లు గుర్తిస్తే సమస్యను దాచకుండా వెంటనే చికిత్స అందించాలని పోలీసులు సూచించారు. ఈ విధమైన సహాయం మరియు కౌన్సెలింగ్ కోసం బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు 87125 84473, 87126 85299 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ రాంరెడ్డి, పోలీస్ మరియు ఎంజీఎం ఆసుపత్రి అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి : మంత్రి సీతక్క పిలుపు

(ఏటూరునాగారం -- పవర్):




కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి అసలైన బలమని, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవులపల్లి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించి మంత్రికి ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనలో పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమంతో పాటు ములుగు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత పదేళ్లలో జరగని అనేక అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్ప కాలంలోనే చేపడుతోందన్నారు.

**తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మరు**

ములుగు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుడు ప్రచారం, అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలుసని, అభివృద్ధి పనులను కళ్లారా చూస్తున్న ప్రజలు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అభివృద్ధిని అడ్డుకునేలా అసత్యాలు ప్రచారం చేసే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

?ప్రతి గ్రామానికి సంక్షేమ ఫలాలు

ప్రజా ప్రభుత్వ పాలనలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఉద్యోగ అవకాశాలు, గ్రామీణ రహదారుల అభివృద్ధి వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టి, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ వివరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పైడాకుల అశోక్, స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ**

## శాయంపేటలో సీఎం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

(శాయంపేట -- పవర్):





శాయంపేట మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'బ్రేక్‌ఫాస్ట్' (అల్పాహార) కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూపాలపల్లి శాసనసభ్యులు శ్రీ గండ్ర సత్యనారాయణ రావు గారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి ఆయన అల్పాహారాన్ని స్వీకరించి, వారికి అందుతున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శ్రీ అనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టి ప్రైవేట్ బదులకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. పేద విద్యార్థులు ఆకలితో పాఠశాలలకు రాకూడదనే ఉద్దేశంతోనే ఈ అల్పాహార పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యావ్యవస్థ బలోపేతానికి 11 వేల మంది ఉపాధ్యాయుల నియామకం చేపట్టామని, మౌలిక సదుపాయాల కల్పన, నూతన భవనాల నిర్మాణం, డిజిటల్ విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందిస్తున్నామని చెప్పారు. శాయంపేట మండలంలోని 27 పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలో మొత్తం 922 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని, బిసి వెల్ఫేర్ శాఖ కార్యదర్శి సైదులు గారు కూడా ప్రభుత్వ బడిలోనే చదివి ఐఏఎస్ అధికారిగా ఎదిగారని గుర్తుచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

**– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ**

# శ్రీకృష్ణ జన్మాష్టమి – విశ్వ నాయకుడి జన్మదినం

పవర్ పత్రిక ప్రత్యేక కథనం

"ధర్మం కోసం ధైర్యంగా నిలబడితే... విజయం ఎప్పటికైనా మనదే!"

– ఓదెల చంద్రమౌళి (పినాకిల్ అకాడమీ)



"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥"

**అర్థం:** సాధువులను రక్షించడానికి, దుష్టులను శిక్షించడానికి, ధర్మాన్ని స్థాపించడానికి నేను యుగయుగాల్లో అవతరిస్తాను అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో ప్రకటించాడు.

శ్రీకృష్ణ జన్మాష్టమి అంటే కేవలం ఒక పండుగ కాదు. విశ్వానికి ధర్మాన్ని బోధించిన ఒక మహానుభావుడి జన్మదినం. శ్రీకృష్ణుడు తన జీవితంతో ధర్మం, ధైర్యం, జ్ఞానం, కర్తవ్యం, నాయకత్వం అంటే ఏమిటో ప్రపంచానికి చూపించాడు.

- కష్టాల్లో పుట్టిన మహానాయకుడు
- "కష్టాల్లో పుట్టినవాడే... కష్టాలను జయించే శక్తిని చూపగలడు!"
- శ్రీకృష్ణుడి జననం ఒక అద్భుతం. రాజకుటుంబంలో జన్మించినప్పటికీ ఆయన బాల్యం రాజభోగాల్లో సాగలేదు. కంసుని భయంతో దేవకీ, వసుదేవులు కారాగారంలో ఉన్న సమయంలో కృష్ణుడు జన్మించాడు.
- పుట్టిన వెంటనే తల్లిదండ్రులకు దూరమై గోకులానికి వెళ్లాడు. అక్కడ నందుడు, యశోదమ్మల సంరక్షణలో పెరిగాడు. అయితే ఆ కష్టాలు కృష్ణుడిని బలహీనుడిని చేయలేదు; ఆ కష్టాలే ఆయనను మరింత శక్తివంతమైన నాయకుడిగా తీర్చిదిద్దాయి.
- అల్లరిలో ఆనందం... జీవితంలో ఆదర్శం
- "బాల్యంలో అల్లరి... జీవితంలో అద్భుతమైన కార్యం!"
- బాలకృష్ణుడి వెన్న దొంగతనం, గోపబాలురతో ఆటలు, గోపికలతో లీలలు అందరికీ ఆనందాన్ని పంచాయి. కానీ ఆ అల్లరి బాలుడే ఎదిగే కొద్దీ ప్రజలకు రక్షకుడిగా మారాడు.
- చిన్ననాటి నుంచే ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొని, అనేక దుష్ట శక్తులను సంహరించి, ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చాడు. అందుకే కృష్ణుడి బాల్యం మనకు ఆనందాన్ని ఇస్తే, ఆయన జీవితం మనకు ప్రేరణను ఇస్తుంది.
- ధర్మానికి నిలువెత్తు రూపం
- "అధర్మం ఎంత బలంగా ఉన్నా... ధర్మం ముందు నిలవలేదు."
- శ్రీకృష్ణుని జీవితంలో ధర్మానికి అత్యున్నత స్థానం ఉంది. ప్రజలను బాధించిన దుష్టులను ఎదుర్కొన్నాడు. అన్యాయాన్ని అడ్డుకున్నాడు. అవసరమైన చోట కఠిన నిర్ణయాలు తీసుకున్నాడు.
- కంసుడు వంటి దుష్టులను అంతం చేసి ప్రజలకు విముక్తి కల్పించాడు. అందుకే కృష్ణుడు కేవలం ఒక రాజు కాదు---ధర్మాన్ని స్థాపించిన మహానాయకుడు.
- యుద్ధరంగంలో గురువు
- "చేతిలో ఆయుధం లేకపోయినా... జ్ఞానంతో యుద్ధం గెలిపించవచ్చు!"
- మహాభారతంలో శ్రీకృష్ణుడు ఒక అద్భుతమైన నాయకత్వాన్ని చూపించాడు. కురుక్షేత్రంలో అర్జునుడు సందిగ్ధంలో పడినప్పుడు అతనికి ధైర్యం చెప్పి, కర్తవ్యాన్ని గుర్తు చేశాడు. అక్కడే ప్రపంచానికి భగవద్గీత అనే అమూల్యమైన జ్ఞానాన్ని అందించాడు.
- "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన"
- అనే బోధన ద్వారా కర్తవ్యాన్ని నిజాయితీగా చేయాలని, ఫలితంపై అతిగా ఆందోళన చెందకూడదని సందేశం ఇచ్చాడు.
- నేటి యువతకు కృష్ణుడి సందేశం
- "భయపడకు... ధర్మంతో ముందడుగు వేయి!"
- ఈరోజు యువతకు శ్రీకృష్ణుడి జీవితం ఎంతో గొప్ప సందేశాన్ని ఇస్తుంది:
- కష్టాలు వచ్చినప్పుడు వెనక్కి తగ్గకూడదు.
- అన్యాయం ఎదురైనప్పుడు మౌనంగా ఉండకూడదు.
- విజయం కోసం తప్పు మార్గాన్ని ఎంచుకోకూడదు.
- ధైర్యంతో ముందుకు సాగాలి.
- ధర్మంతో నిర్ణయాలు తీసుకోవాలి.
- కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించాలి.
- "ధైర్యం నీ అడుగుల్లో ఉంటే... ధర్మం నీ వెంట ఉంటే... విజయం నీ వెనకే వస్తుంది."
- సమాజం నేర్చుకోవాల్సిన పాఠం
- శ్రీకృష్ణుడి జీవితం నుంచి మనం మూడు గొప్ప విషయాలను నేర్చుకోవాలి:
- **ధైర్యం:** కష్టాలను ఎదుర్కోవడానికి.
- **ధర్మం:** సరైన మార్గంలో నడవడానికి.
- **జ్ఞానం:** సరైన నిర్ణయం తీసుకోవడానికి.
- ఈ మూడు మన జీవితంలో ఉంటే మనిషి ఎంతటి పరిస్థితినైనా ఎదుర్కోగలడు.
- కృష్ణుడు ఎందుకు చిరస్మరణీయుడు?
- శ్రీకృష్ణుడు ఒకే రూపంలో కనిపించడు:
- బాలుడిగా ఆనందం
- స్నేహితుడిగా ఆప్యాయత
- గురువుగా జ్ఞానం
- నాయకుడిగా వ్యూహం
- ధర్మరక్షకుడిగా ధైర్యం
- మార్గదర్శిగా జీవిత సత్యం చూపించాడు.
- అందుకే వేల సంవత్సరాలు గడిచినా శ్రీకృష్ణుని బోధనలు నేటికీ మనకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.
- ముగింపు
- శ్రీకృష్ణ జన్మాష్టమి అంటే కేవలం కృష్ణుడి జన్మదినాన్ని జరుపుకోవడం కాదు.
- మనలోని ధైర్యాన్ని మేల్కొలపడం.
- మనలోని ధర్మాన్ని నిలబెట్టడం.
- మన కర్తవ్యాన్ని గుర్తుచేసుకోవడం.
- అధర్మం ఎప్పుడు పెరిగినా ధర్మం కోసం నిలబడే ధైర్యం మనలో ఉండాలి.
- "కృష్ణుడు పుట్టింది ఒక యుగంలో... కానీ ఆయన బోధనలు ప్రతి యుగానికీ."
- నేటి యువత కృష్ణుడి నుంచి ధైర్యం, ధర్మం, జ్ఞానం, నాయకత్వం నేర్చుకుంటే సమాజం మరింత బలపడుతుంది. కృష్ణుడిని పూజించడమే కాదు... కృష్ణుడి మార్గంలో నడవడమే నిజమైన కృష్ణారాధన.

**శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు!**

**– పవర్ దినపత్రిక డిస్ట్రిక్ట్ స్టాఫ్ రిపోర్టర్, ఇర్సడ్ల వంశీకృష్ణ**



# సింపుల్ లుక్.. స్టైలిష్ టచ్..

## మోడ్రన్ డ్రెస్‌లో హుషారు పిట్ట ..

టాలీవుడ్‌లో యంగ్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంటున్న వాసవి గణేషన్.. 'హుషారు పిట్టలు' చిత్రంతో పరిచయమయ్యారు. తాజాగా మోడ్రన్ డ్రెస్‌లో దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా.. ఆమె స్టైలిష్ లుక్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది.ట్రెండీ అవుట్ ఫిట్ లో వివిధ పోజులతో మెరిసిన వాసవి.. స్టైల్, కాన్ఫిడెన్స్‌తో ఫ్యాన్స్‌ను ఫిదా చేశారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ భామ తాజా పిక్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.





# ప్రీ రిలీజ్‌లో సురభి సందడి

## లాంగ్ ఫ్రాక్‌లో సురభి మెరుపులు..

అల్లరి నరేష్ కథానాయకుడిగా నటించిన ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక' ప్రీ రిలీజ్ ఈవెంట్ సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి చిత్ర కథానాయిక సురభి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లాంగ్ ఫ్రాక్‌లో హాజరైన ఆమె తన సింపుల్ లుక్‌తో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సురభి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సురభితో పాటు రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ కథానాయికలుగా నటిస్తున్నారు. వెన్నెల కిషోర్, నరేష్ వీకే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రంభ, ఊర్వశి, మేనక అనే దేవకన్యలు భూలోకానికి రావడంతో కథలో చోటుచేసుకునే పరిణామాల చుట్టూ ఫాంటసీ, కామెడీ అంశాలను మేళవించినట్లు చిత్రబృందం తెలిపింది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, పాటలకు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. చాలా కాలం తర్వాత తనదైన కామెడీ జానర్‌లో పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంతో వస్తున్నానని అల్లరి నరేష్ తెలిపారు. ప్రేక్షకులను రెండున్నర గంటల పాటు నవ్వించడమే లక్ష్యంగా సినిమా రూపొందించినట్లు పేర్కొన్నారు.

# బీచ్‌లో మంజరీ

## బోల్డ్ లుక్‌లో హీరోయిన్

ఒకప్పటి హీరోయిన్‌గా ప్రేక్షకులను అలరించిన నటి మంజరి ఫడ్నిస్ మరోసారి సోషల్ మీడియాలో సందడి చేశారు. తాజాగా బీచ్‌లో స్టైలిష్ అండ్ బోల్డ్ లుక్‌లో ఫొటోషూట్ చేసిన ఆమె, ఆ ఫొటోలను తన సోషల్ మీడియా ఖాతాలో అభిమానులతో పంచుకున్నారు. సముద్ర తీరంలో గ్లామరస్ అవతార్‌లో కనిపించిన మంజరి ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఆమె స్టన్నింగ్ లుక్స్‌కు నెటిజన్లు ఫిదా అవుతూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



# మెరిసిన మేనక..

## గాగ్రాచోళిలో ప్రిషా సింగ్.. అదుర్స్!

టాలీవుడ్‌లో తనదైన గుర్తింపు తెచ్చుకుంటున్న యంగ్ హీరోయిన్ ప్రిషా సింగ్ తాజాగా 'రంభ ఊర్వశి మేనక' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సందడి చేశారు. ఈ సినిమాలో మేనక పాత్రలో కనిపించనున్న ఆమె.. ఈ సందర్భంగా గాగ్రాచోళిలో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గాగ్రాచోళికి తగ్గట్టుగా చేసిన స్టైలింగ్, ఆభరణాలు, హెయిర్ స్టైల్‌తో ప్రిషా సింగ్ ట్రెడిషనల్ లుక్‌లో మెరిశారు. ఈ సందర్భంగా కెమెరాలకు వివిధ పోజులు ఇస్తూ సందడి చేశారు. ఆమెకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రిషా సింగ్ గతంలో హిందీ చిత్రం 'గులాబో సితాబో'తో సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత తెలుగులో 'స్పై', 'బడ్డీ' వంటి చిత్రాల్లో నటించారు. 'రంభ ఊర్వశి మేనక'లో అల్లరి నరేష్, సురభి, రాశి సింగ్, విష్ణుప్రియలతో కలిసి నటిస్తున్నారు. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. . తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆమె గాగ్రాచోళి లుక్ సినిమాపై మరింతగా అందరి దృష్టిని ఆకర్షించింది.






యాంకర్ మంజూషకు తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. సినిమాల్లో నటిగా కెరీర్ ప్రారంభించిన ఆమె.. అనంతరం యాంకరింగ్ వైపు అడుగులు వేసి తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం సినిమా ఈవెంట్లు, టెలివిజన్ కార్యక్రమాలతో బిజీగా ఉంటూనే సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటున్నారు. తాజాగా మంజూష చీరకట్టులో

# అదిరిన అందం!

## చీరకట్టులో మంజూష..

దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సంప్రదాయ దుస్తుల్లో కనిపించిన ఆమె అందమైన లుక్‌తో ఆకట్టుకున్నారు. సింపుల్‌గా, ఎలిగెంట్‌గా కనిపించేలా చేసిన ఈ ఫొటోషూట్ అభిమానులను విశేషంగా ఆకర్షిస్తోంది. చీరకట్టులో మంజూషకు మంచి క్రేజ్ ఉంది. గతంలోనూ ఆమె చీరలో చేసిన ఫొటోషూట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా లైట్ బ్లూ, రెడ్ వంటి రంగుల చీరల్లో ఆమె లుక్స్‌కు నెటిజన్ల నుంచి మంచి స్పందన వచ్చింది.